క్లుప్తంగా

ఆలయాన్ని ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీని తొలగించాలి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం శ్రీకృష్ణ మందిరం ఈశాన్య మూలను ఆనుకొని ఏర్పాటు చేసిన ఇనుప బడ్డీని తొలగించాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌ను ఆలయ వ్యవస్థాపకులు, చైర్మన్ యలమంచిలి పెద అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం ఆలయ నిర్మాణం చేపట్టామని, అయితే ఆలయం ఈశాన్య మూల గోడను ఆనుకొని స్థానికంగా ఉంటున్న వ్యక్తి బడ్డీ ఏర్పాటు చేయడం వల్ల వాస్తు సమస్యతోపాటు బడ్డీకి వచ్చే ఆకతాయిలు వాటర్ బాటిళ్లను, మందు ఖాళీ సీసాలను, వాటర్‌ప్యాకెట్లు, ఖైనీలు వంటి వ్యర్థాలను ఆలయ ఆవరణలో విసిరివేస్తున్నారని, దీంతో ఆలయం అపవిత్రంగా మారుతోందని, అధికారులు స్పందించి బడ్డీని కొద్ది దూరం జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆటలు, పాటలతో చిన్నారుల సందడి



ఆటల్లో పాల్గొన్న చిన్నారులు

గాజువాక : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో చిన్నారులు గురువారం ఆటలు, పాటలతో సందడి చేశారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ ఆటల్లో పాల్గొన్నారు. పాటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి చిన్నారులకు నీతి కథలను బోధించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం బోధించిన స్ఫూర్తి ప్రసంగాలను చిన్నారులకు వివరించారు.

66వ వార్డులో వీధి దీపాల పరిశీలన



వార్డులో పర్యటిస్తున్న ఇమ్రాన్ తదితరులు

గాజువాక : జీవీఎంసీ 66వ వార్డులోని వివిధ కాలనీల్లో పని చేయని వీధి దీపాలను వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ బుధవారం గురువారం పరిశీలించారు. సంబంధిత విభాగానికి చెందిన అధికారులతో కలిసి బీసీ రోడ్, సీతారామ్‌నగర్, ఇందిరా కాలనీ, నవాబ్‌నగర్, కైలాసనగర్, కణితి రోడ్, అజీమాబాద్ ప్రాంతాల్లోని విద్యుద్దీపాలను పరిశీలించారు. ఈ కాలనీల్లో విద్యుద్దీపాలు సరిగా పని చేయడంలేదని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వాటిని అధికారులకు చూపించారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, షఫీ, కుప్పిలి సత్యనారాయణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి



అహల్యబాయి హోల్కర్ జయంతిలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక : మాల్వా సామ్రాజ్యపు హోల్కర్ వంశ రాణి, రాజమాత అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 70వ వార్డులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ, 18వ శతాబ్దంలో అహల్యాబాయి 30 ఏళ్లపాటు మరాఠా సామ్రాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించారని కొనియాడారు. ఆలయాల అభివృద్ధికి ఆమె చేసిన సాహసోపేతమైన కార్యక్రమాలను, ఆమె పరిపాలన దక్షతను వివరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి చినముషిడివాడకు చెందిన ఎస్.నర్సింగరావు రూ.లక్ష 116 విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్లో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు.

ప్యాకేజీ ఇచ్చి.. పీకమీద కత్తిపెట్టి



ప్యాకేజీ పేరుతో సవాలక్ష షరతులు

- కార్మికుల తగ్గింపు ఇందులో భాగమే..
- ఇంకా ఎన్నాళ్లు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె
- అయోమయంలో ఉక్కు వర్గాలు
- రాజకీయ నిర్ణయంతోనే పరిష్కారం



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ముగింపు ఎప్పుడు పడుతుందో స్పష్టత కొరవడటంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుండగా, యాజమాన్యం తమ చేతిలో ఏమీ లేదని పేర్కొంటోంది. స్టీల్‌ప్లాంట్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన నేపథ్యంలో, కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను తగ్గించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇందులో భాగంగా, పర్మనెంట్ ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేశారు. అదేవిధంగా, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను 14 వేల నుండి 10 వేలకు తగ్గించాలని నిర్దేశించారు. ఈ నిర్దేశం మేరకు, ఇప్పటికే రెండు విడతల్లో సుమారు 1,670 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. ప్రస్తుత సమ్మె నేపథ్యంలో, మరో 1,480 మంది కార్మికులకు బయోమెట్రిక్ హాజరును నిలిపివేశారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ప్యాకేజీతోనే ముసలం

కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు ప్రకటించిన ప్యాకేజీ వెనుక అనేక నిబంధనలు, షరతులు ఉన్నాయి. ఈ ప్యాకేజీలో ప్రధానంగా సిబ్బంది తగ్గింపు, దశలవారీగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలు ఉన్నాయని ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మంత్రిత్వ శాఖ అందించిన సమాచారం ప్రకారం, ఈ ప్యాకేజీలో భాగంగా మొదట రెండవ బ్లాస్ట్‌ఫర్నేస్‌ను, ఆ తర్వాత మూడవ బ్లాస్ట్‌ఫర్నేస్‌ను ప్రారంభించి, తద్వారా పూర్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ షరతుల నేపథ్యంలో, కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు ప్యాకేజీ ప్రకటించిన తర్వాత స్టీల్‌ప్లాంట్ వ్యవహారాలపై దృష్టి సారించడం లేదని, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలను కలవడానికి ఆసక్తి చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి సమస్యలను పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు మంత్రిత్వశాఖ నిర్ణయం మేరకే...

స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలు, ముఖ్యంగా సిబ్బంది తగ్గింపు నిర్ణయం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకే జరుగుతున్నాయని స్పష్టమవుతోంది. గత కొన్ని నెలలుగా ప్లాంట్ రోజువారీ కార్యకలాపాలు కూడా ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే సాగుతున్నాయి. గతంలో 4 వేల మంది కార్మికుల గేటు పాసులు నిలిపివేయడం, దానిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో రాజకీయ నిర్ణయం ద్వారా రాత్రికి రాత్రే వాటిని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సొంతంగా నిర్ణయం తీసుకుంటుందని భావించడం సరికాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ పార్టీలపైనే పరిష్కార భారం

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె పరిష్కారం కార్మిక సంఘాల పరిధిని దాటిపోయింది. ఈ సమ్మె పరిష్కారం పూర్తిగా రాజకీయ పార్టీల చేతుల్లోనే ఉందని చెప్పవచ్చు. అధికారంలో ఉన్న కూటమిలోని రాజకీయ పార్టీలతో పాటు, ప్రతిపక్ష పార్టీలన్నింటిపై ఒత్తిడి తేవడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. కనీసం కొంత కాలం పాటు తొలగింపులను వాయిదా వేయాలని మంత్రిత్వ శాఖను కోరడం ద్వారా ప్రస్తుత పరిస్థితికి తాత్కాలిక ఉపశమనం లభించవచ్చని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు.

కూటమి ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు



ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తున్నా స్పందించకపోవడం తగదు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ఉద్దేశించిందేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల హామీలను విస్మరించి, కార్మికుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చుతున్నారు. ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. కార్మికుల తొలగింపును ఆపాలి. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి.

– నీరుకొండ రామచంద్రరావు, చీఫ్ పేట్రన్, స్టీల్ ఐఎన్‌టీయూసీ

పీడిస్తున్న చెత్త సమస్యకు పరిష్కారం



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం : వడ్లపూడి ప్రజలను దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న చెత్త సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గురువారం అధికారులు చెత్తను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. పెద్ద సంఖ్యలో లారీలు, జేసీబీలను ఏర్పాటు చేసి, ఆటోనగర్‌లోని డంపింగ్ యార్డుగా మారిన ఖాళీ స్థలం నుంచి **చెత్తను తొలగించే పనులు ము**మ్మరంగా చేపట్టారు. **87వ వార్డులోని తిరుమలన**గర్, కళింగవీధి, శివాజీ**నగర్, గణేష్‌నగర్ తదితర** ప్రాంతాల ప్రజలకు **ఆటోనగర్ (ముఖ్యంగా ఈ.** బైక్ షోరూం పక్కన) **నిల్వ ఉన్న ఈ చెత్త పెద్ద** సమస్యగా మారింది. **దుర్గంధం కారణంగా శ్వాస** పీల్చుకోవడం కూడా **కష్టంగా మారిందని స్థానికులు** ఆవేదన వ్యక్తం **చేశారు. దీనిపై తిరుమలన**గర్ వాసులు ఏపీఐఐసీ అధికారులకు, జీవీఎంసీకి పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులకు స్పందించిన ఏపీఐఐసీ కమిషనర్ కిరణ్‌కుమార్ నెల రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని సందర్శించి, చెత్తను తొలగించి, ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు, అధికారులు గురువారం చెత్త తొలగింపు పనులు ప్రారంభించారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు ఘన సత్కారం



ఉక్కు హెచ్‌ఆర్ జీఎం గాంధీను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.గాంధీకి స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సం**క్షేమ సంఘం ఆధ్వర్యంలో** ఘనంగా సత్కారం జరిగింది. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయనున్న సందర్భంగా గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు గాంధీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత రెండేళ్లుగా ప్లాంట్ అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం గాంధీ ఎప్పుడూ వెనుకాడకుండా తన వంతు సహకారం అందించారని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కూడా ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం ఎం. మధుసూదనరావు, అసోసియేషన్ అధ్యక్షులు తొడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు నల్లి సుందరం, బాబు నాయక్, జీఎం వి. చిట్టిబాబు, డీజీఎం వరప్రసాద్, నాయకులు కేవీ రత్నం, డి. పుల్లారావు, లక్ష్మణమూర్తి, ఎం.గణేష్, మోడీ నాయక్, తిమోతి బాబు, రామకృష్ణ, చింతా మోహన్‌రావు, బి. అరవింద్ కుమార్, రామన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు 'సహిత విద్య' సర్వే



ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీ సూర్యనారాయణ

పెదగంట్యాడ: దివ్యాంగులైన చిన్నారులను గుర్తించేందుకు సహిత విద్య ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) బృందాలు సర్వేను ప్రారంభించాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా, వారి శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సర్వే చేపడుతున్నారు. ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల పరిధిలో ఈ గుర్తింపు కార్యక్రమం జరుగుతోంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మిగిలిన పిల్లలతో సమానంగా అన్ని అవకాశాలూ కల్పించేందుకు ఈ భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వారికి సహిత విద్యను అందించడంతో పాటు, అవసరమైన ఉపకరణాలను కూడా అందిస్తున్నారు. సమాజంలో ఇంకా గుర్తించబడని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడానికి భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. 'ఇంక్లూజన్–2025' లో భాగంగా దివ్యాంగులందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలల్లో చేర్పడమే ఈ సర్వే ప్రధాన లక్ష్యం. ఈ సర్వేలో భాగంగా విద్యార్థి దశలో ఉన్న మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు, ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలను కూడా అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, వారిని పాఠశాలలకు రప్పించేలా చర్యలు తీసుకోవడం వంటివి ఈ సర్వేలో ముఖ్యమైన అంశాలు. ఈ ప్రత్యేక సర్వే మే 13వ తేదీ నుంచి ప్రారంభమైంది.

పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బుల అందజేత



పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బులను పంపిణీ చేస్తున్న చందు

గాజువాక: 70వ వార్డులో విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి గురువారం కొబ్బరి నూనె, సబ్బులను పంపిణీ చేశారు. వార్డు శానిటరీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు స్వయంగా వాటిని కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్యాన్ని పెంపొందించేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడంలో పారిశుధ్య సిబ్బంది సేవలు ఎనలేనివని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. అగనంపూడిలో జరిగిన కార్యక్రమంలో వార్డులోని పారిశుధ్య సిబ్బందికి ఆమె సబ్బులు, నాలుగు లీటర్ల కొబ్బరి నూనెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామన్నారు. అగనంపూడి రింగ్ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు చేశామని, బొర్రమాంబ గుడి వెనుక ఉన్న చెరువు గట్టును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని ఆమె తెలిపారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి. సీతారామయ్య, కోసూరి తాతారావు, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అరుస్తూ..కరుస్తూ..



బాలచెరువు శివాలయం ప్రాంతంలో వీధి కుక్కల వీరంగంతో భయంతో మహిళ

- వీధుల్లో కుక్కల బెడద
- గుంపులు సంచారం
- దాడులతో వణికిపోతున్న ప్రజలు
- పట్టించుకోని జీవీఎంసీ సిబ్బంది



మదీనాబాగ్‌లో కుక్కల సంచారం

పెదగంట్యాడ: రోడ్లపై నడవాలంటేనే భయం కలిగించేలా వీధి కుక్కల బెడద తీవ్రంగా మారింది. నిత్యం తిరిగే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత భయానకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ, మనుషులను, వాహనదారులను వెంటపడి కరుస్తున్నాయి. మండలంలో ఇటీవల కాలంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఇస్లాంపేట, మదీనాబాగ్, నడుపూరు, సిద్దేశ్వరం, దయాల్‌నగర్, నెల్లిముక్కు, బాలచెరువు, పిట్టవానిపాలెం, నమ్మిదొడ్డి వంటి ప్రాంతాల్లో వీధి కుక్కల గుంపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద రాత్రి వేళల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు.

పెరుగుతున్న కుక్క కాటు కేసులు

మండలంలో రోజురోజుకూ కుక్క కాటు కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెలకు 50 నుంచి 60 కేసులు నమోదవుతున్నాయి. సిద్దేశ్వరం యూపీహెచ్‌సీ పరిధిలో నెలకు 28 నుంచి 30 కేసులు, గంగవరంలో నెలకు 10 నుంచి 15 కేసులు, దేవాడ పీహెచ్‌సీ పరిధిలో 25 వరకు కేసులు, నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ పరిధిలో 30 వరకు కేసులు నమోదవుతున్నాయి.

ప్రతి రోజూ దాడులు

ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట కుక్క కరిచిందని బాధితులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీలు), అర్బన్ పీహెచ్‌సీలకు (యూపీహెచ్‌సీలు) పరుగులు తీస్తున్నారు. బాధితులు పెరుగుతున్నప్పటికీ, అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండటంతో బాధితులకు తక్షణమే టీకాలు వేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

కుక్కల నియంత్రణకు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వీధి కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం



విశేష అలంకరణలో బంగారుమాంబ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులోని నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక అమ్మవార్ల పండుగ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి గురువారం వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ వేడుకలు గ్రామ ప్రజల భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా పూర్తయ్యాయి. మే 21న చాటింపుతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతీ రోజు ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 25న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. 27న నూకాంబిక అమ్మవారి మహోత్సవం ఘనంగా జరిగింది. చివరిరోజు గురువారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి గ్రామస్తులు సత్తెమ్మ తల్లికి కర్రల రక్షణలో బంగారుమాంబ ఆలయం వద్దకు నైవేద్యాన్ని తీసుకెళ్లారు. అమ్మవారికి పట్టాపోతును సమర్పించిన అనంతరం సాయంత్రం సాముగరిడి, తప్పెట గుళ్లు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్చుతూ అనుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి స్టేజ్ ప్రోగ్రాములు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశేష అలంకరణలో బంగారుమాంబ అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ పరిసరాలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్మాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పల్లేల శ్రీనినివాసరావు, గవర వెంకటరమణారావు, గండ్రెడ్డి ప్రకాశరావు, సండ్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకటరావు, సండ్రాన కిషోర్, గోపిశెట్టి సోమునాయుడు, కనుమరెడ్డి శ్రీనివాసరావు పూజా ఏర్పాట్లతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కర్రల రక్షణలో సత్తెమ్మ తల్లికి నైవేద్యం తీసుకువెళ్తున్న గ్రామస్తులు

మళ్లీ లిఫ్ట్ కష్టాలు



మరమ్మతులకు గురైన దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ తరచుగా మరమ్మతులకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. లిఫ్ట్ ఏర్పాటు చేసి రెండేళ్లయినా, ఈ కాలంలో కనీసం 30 సార్లు పైగా మరమ్మతులకు గురైందని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో లగేజీలు, వృద్ధులు, పిల్లలతో ప్రయాణించే వారికి అగచాట్లు తప్పడం లేదు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు నుంచి ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానిస్తూ ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. అయితే, లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నెలకు కనీసం ఒకటి, రెండు సార్లు మరమ్మతులకు గురవుతోంది. సంబంధిత కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించకపోవడంతో మూడు నుంచి నాలుగు రోజుల పాటు లిఫ్ట్ నిలిచిపోతోంది. దీంతో ఒకటి నుంచి నాలుగు ప్లాట్‌ఫామ్‌కు రావాలన్నా, లేదా నాలుగు నుంచి ఒకటి ప్లాట్‌ఫామ్‌కు లగేజీలతో వెళ్లాలన్నా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైన లిఫ్ట్, మళ్లీ గురువారం ఉదయం నుంచి పనిచేయడం మానేసింది. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులను తిట్టుకుంటూ, ఎండలో లగేజీలు మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి, లిఫ్ట్ మరమ్మతులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం



సుజాత (ఫైల్)

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులు తెలిపారు. పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ గ్రామం, నీలాపువీధిలో దాతుల విజయ్ తన భార్య సుజాతతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. విజయ్ గాజువాకలోని ఓ మెకానిక్ షెడ్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఈ నెల మే 25న భర్తతో గొడవ పడిన సుజాత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త విజయ్, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో విజయ్ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.